క్లుప్తంగా

నేడు హ్యాండ్లూమ్ మేళా ప్రారంభం

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో సెప్టెంబర్ 1 నుంచి దసరా పండుగ వరకు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ మేళాను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అక్బర్ అలీ, తాయర్ అలీ, గంగాధర్‌లో ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్వయంగా తయారు చేసిన ఖాదీ వస్త్రాలతో పాటు వివిధ రకాల చీరలు, గృహోపకరణాలు, వన్‌గ్రామ్ గోల్డ్ అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ మేళాలో డెబిట్, క్రెడిట్ కార్డులపై కూడా కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఈ మేళాను శుక్రవారం ఉదయం 10గంటలకు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోండి

ఆల్విన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 2,3 తేదీల్లో ప్రభుత్వం కల్పించిన ఓటరు నమోదు, చిరునామాలోని మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. పాపిరెడ్డినగర్ నగర్‌లోని రోడ్డు నం.2లోని రెయిన్‌బో పాఠశాల, 19 రోడ్డులోని రాజధాని పాఠశాలలో రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకొని రానున్న ఎన్నికల్లో ఓటు వేసేందుకు సిద్ధంగా ఉండాలని చంద్రారెడ్డి తెలిపారు.

3న ల్యాప్‌టాప్, స్కాలర్‌షిప్పుల పంపిణీ

సనత్‌నగర్: పేద విద్యార్థులకు చేయూతనందించే లక్ష్యంతో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (బీఎస్‌ఎస్‌ఎస్) తెలంగాణ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న ల్యాప్‌టాప్, స్కాలర్‌షిప్పుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని అన్నపూర్ణ భవనంలో జరిగే ఈ బృహత్తర కార్యక్రమంలో 200 మందికి ల్యాప్‌టాప్‌లు, స్కాలర్‌షిప్పులు అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, విశిష్ట అతిథులుగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, నీటి పారుదల కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలాచారిలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ జేఏసీ కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, సమాఖ్య ప్రతినిధులు ఎంవీ శాస్త్రి, రామచంద్రమూర్తి, విజయలక్ష్మీ, పంచగంగేశ్వర్, రవీంద్ర, సోమయాజులు, ఉపేంద్ర కుమార్ పాల్గొన్నారు.

రహస్యంగా వీడియో తీసిన యువకుడి అరెస్టు

అమీర్‌పేట్: యువతి స్నానం చేస్తుండగా రహస్యంగా సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తున్న యువకుడిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రామప్రసాద్‌రావు వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్‌లో ఉంటున్న ఓ యువతి (22) బుధవారం రాత్రి బాత్రూమ్ స్నానం చేస్తుండగా వెంటిలేషన్ నుంచి ప్రశాంత్ అనే యువకుడు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా గమనించిన యువతి కేకల వేయడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

బీసీలను చైతన్యం చేస్తాం

పంజగుట్ట: రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని... జనాభా ప్రాతిపదికన సీట్లు మాత్రం ఇవ్వడం లేదని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్‌ఎస్) సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మధుగౌడ్ కక్కిర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బీసీలకు ఐక్యం చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించామని వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ బీసీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తుందో ఆ పార్టీకే బీసీల మద్దతు ఇచ్చేలా బీసీల్లో చైతన్యం తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ కులాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం సేవా సంస్థగా కొనసాగుతున్న తెలంగాణ రక్షణ సమితి (టీఆర్‌ఎస్)ను త్వరలోనే రాజకీయ పార్టీగా మార్చనున్నట్లు, వచ్చే ఎన్నికల నాటికి పార్టీ రిజిస్ట్రేషన్ పూర్తిచేసి ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకుని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 20 శాతం సీట్లు ఇచ్చి మోసం చేసిందని, తక్కువ శాతం ఉన్న అగ్రకులాలకు 50కి పైగా టిక్కెట్లు ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు అయినా స్పందించి బీసీలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో బీసీ నాయకులు నర్సింగరావు, రాజ్ గణేష్, బింగి రాములు, పి.గణపతి, లక్ష్మణ్, హైమావతి, శివకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాఖీ కట్టి.. ఆశీర్వదించి

కూకట్‌పల్లి నియోజకవర్గంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రజలు కుటుంబ సమేతంగా ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్లు గురువారం రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు వారి అక్కా చెల్లెళ్లతో పాటు స్థానిక మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు.
– కూకట్‌పల్లి జోన్ బృందం


కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రాఖీ కడుతున్న చిన్నారులు


ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రాఖీలు కడుతున్న ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మహిళలు


మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్‌కు రాఖీలు కడుతున్న మహిళలతో కార్పొరేటర్ సబిహా బేగం


టీపీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావుకు రాఖీ కడుతున్న సోదరీమణులు


ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌కు రాఖీలు కడుతున్న మహిళలు


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి రాఖీ కడుతున్న కార్పొరేటర్ రోజాదేవి


కూకట్‌పల్లి మార్కెట్ కమిటి డైరెక్టర్ మహ్మద్ జాహెద్ షరీఫ్ బాబాకు రాఖీలు కడుతున్న మహిళలు


టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంకు రాఖీ కడుతున్న మహిళలు


ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌కు రాఖీలు కడుతున్న మహిళలు


మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

నేటి నుంచి బీజేపీ మట్టి సేకరణ కార్యక్రమం

• గ్రామం నుంచి అమృత్ కలశ్ యాత్ర

కూకట్‌పల్లి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటికను నిర్మించడానికి దేశంలో ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాష్ నడ్డా ఆదేశాల మేరకు 'నా భూమి - నాదేశం'అనే నినాదంతో సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. కాసం వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

◆ ఈ కార్యక్రమాల్లో అన్ని సామాజిక వర్గాల ప్రముఖులు, యువతను కలుపుకొని సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దేశభక్తి కార్యక్రమం నిర్వహించాలన్నారు. జాతీయ పతాకం తప్ప పార్టీ పతాకాలు, కండువాలు వాడొద్దని తెలిపారు. కాషాయ కండువాలు ధరించవచ్చన్నారు. మట్టి లేదా బియ్యం ఇవ్వడానికి నిరాకరించిన వారిని బలవంత పెట్టొద్దని సూచించారు. ఇది పూర్తిగా దేశభక్తి కార్యక్రమం అని తెలిపారు.

◆ స్వాతంత్ర్య సమరయోధుల ఇళ్ల నుంచి.. తెలంగాణ విమోచన కోసం పోరాడి అమరవీరుల ఇళ్ల నుంచి.. కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాల ఇళ్ల నుంచి తప్పని సరిగా మట్టి, బియ్యపు గింజలను సేకరించాలి. ఈ కార్యక్రమాన్ని గ్రామంలోని బొడ్రాయి లేదా గుడి నుంచి ప్రారంభించాలి. అదే విధంగా అనువైన ప్రదేశంలో 75 మొక్కలు నాటాలన్నారు. మట్టి సేకరణ పూర్తయిన తరువాత అమృత కలశాన్ని మండల కేంద్రానికి తరలించేంత వరకు ఒక పవిత్రస్థలంలో భద్రపర్చాలని తెలిపారు. ప్రతి మండలానికి ఒక కలశ్ ప్రముఖ్‌ని నియమించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

సనత్‌నగర్: నిజశ్రావణ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం దుర్గామాత అమ్మవారి ఆలయంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో అర్చకులు సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన చండీ హోమం కార్యక్రమానికి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే శివాలయం అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామివారిని ప్రత్యేకంగా రాఖీలతో అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. సంతోషి మాత అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా 108 కలశాలతో ప్రత్యేక అభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రొ.జీబీ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్) పై పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన అవసరమని ఓయూ న్యాయకళాశాల ప్రొఫెసర్ జీబీ రెడ్డి అన్నారు. గురువారం క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్‌సీఓఎస్‌టీ), ఓయూ ఐపీఆర్ సెల్ ఆధ్వర్యంలో ఐపీఆర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రొ.జీబీ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యావేత్తలు, పరిశోధకులు తమ పరిశోధనలు, ఆవిష్కరణలు(కనుగొన్న నూతన అంశాలు) ప్రచురించే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమాచారాన్ని వినియోగించుకునే ముందు ఆయా అంశాలపై లోతైన పరిశీలనతో పాటు మేధో సంపత్తి హక్కులపై స్పష్టత తీసుకోవడం అవసరమన్నారు. ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నరెడ్డి, టీఎస్‌సీఓఎస్‌టీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రాధిక ప్రసంగించారు.

ట్రాఫిక్ ఆంక్షలు



నేడు హెచ్‌ఐసీసీలో స్వతంత్ర్య భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకలు

రాయదుర్గం: భారత స్వతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ ప్రాంతంలో శుక్రవారం సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో ఆయా మార్గాలలో ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు తీసుకున్నారు.

ఆంక్షలు అమలయ్యే సమయాలు..
ఉదయం 7 గంటల నుంచి..
సాయంత్రం 6 గంటల వరకు..

- నీరూస్ జంక్షన్-సైబర్‌టవర్స్ జంక్షన్, మెటల్ చార్మినార్ జంక్షన్, గూగుట్(సీఐఐ) జంక్షన్, కొత్తగూడ జంక్షన్ రోడ్డు
- మెటల్ చార్మినార్ జంక్షన్, ఖానామెట్ జంక్షన్, హైటెక్స్/హెచ్ఐసీసీ/న్యాక్‌రోడ్డు
- జేఎన్‌టీయూ-సైబర్ టవర్స్, బయోడైవర్శిటీ జంక్షన్
- గచ్చిబౌలి జంక్షన్, బొటానికల్ గార్డెన్ జంక్షన్, కొత్తగూడ జంక్షన్, కొండాపూర్ జంక్షన్

ప్రత్యామ్నాయ మార్గాలు.......

- ట్రాఫిక్ నీరూస్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వైపు ట్రాఫిక్‌ను సీఓడీ (అయ్యప్ప సొసైటీ మాదాపూర్) వద్ద మళ్లించబడుతుంది.
- దుర్గంచెరువు వైపు-ఇనార్బిట్-ఐటీసీ కోహినూర్-ఐకియా బయోడైవర్శిటీ గచ్చిబౌలి, సైబర్ టవర్స్ జంక్షన్‌ను నివారించాలి
- మియాపూర్, కొత్తగూడ, హఫీజ్‌పేట్ ప్రాంతాల నుంచి హైటెక్‌సిటీ వైపు ట్రాఫిక్ సైబర్‌టవర్స్-జూబ్లీహిల్స్ రోలింగ్ హిల్స్, ఏఐజీ ఆస్పత్రి-ఐకియా-ఇనార్బిట్-దుర్గంచెరువు రహదారిని ఉపయోగించవచ్చు. సైబర్ టవర్స్ జంక్షన్‌ను నివారించండి
- ఆర్‌సీపురం, చందానగర్ నుంచి మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల వైపు ట్రాఫిక్ ఉండవచ్చు.
- బీహెచ్‌ఈఎల్-నల్లగండ్ల-హెచ్‌సీయూ, ట్రిపుల్ ఐటీ గచ్చిబౌలి రోడ్డును వినియోగించాలి. ఆల్విన్, కొండాపూర్‌ను రోడ్డును నివారించాలి.

భారీ వాహనాలపై ఈ రూట్లలో..

- జేఎన్‌టీయూ నుంచి సైబర్ టవర్స్
- మియాపూర్ నుంచి కొత్తగూడ
- కావూరి హిల్స్ నుంచి కొత్తగూడ
- బయోడైవర్శిటీ నుంచి సైబర్‌టవర్స్
- నారాయణమ్మ కాలేజ్ నుంచి గచ్చిబౌలి

మహిళాభ్యున్నతికి కృషి

సనత్‌నగర్: డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఫౌండేషన్, సావిత్రమ్మ స్కిల్ సెంటర్ ద్వారా మహిళలు జీవనోపాధి నైపుణ్యాలతో పాటు సాధికారత కల్పిస్తామని టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్యరెడ్డి హామీనిచ్చారు. భోలక్‌పూర్, బర్తన్ కాంపౌండ్, అమీర్‌పేట కుమ్మరిబస్తీలలో బుధవారం ఆయన పర్యటించారు. బర్తన్ కాంపౌండ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడికి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అమీర్‌పేట డివిజన్ కుమ్మరిబస్తీలో పర్యటించి కుమ్మరుల కష్టాలు తెలుసుకుని వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మహిళలు సాధికారత సాధించి అధిక ఆదాయాలు పొందాలనేదే తమ లక్ష్యమన్నారు.

అన్నదానం

రసూల్‌పురా: అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహన్ అన్నారు. శ్రావణ పూర్ణిమ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారం డౌటన్ బజార్ భూలక్ష్మమ్మ దేవాలయం వద్ద గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్, మల్లారెడ్డి, బాల్‌రాజ్, భరత్, విజయ్, విష్ణు డాంజల్, హరీష్, ప్రేమ్ పాల్గొన్నారు.

3న మున్నూరు కాపు జేఏసీ సమావేశం

కాచిగూడ: మున్నూరు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న మధ్యాహ్నం 2 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఎడ్ల రవి పటేల్ తెలిపారు. మున్నూరు కాపు కార్పొరేషన్ సాధన, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరు కాపు అభ్యర్థులను గెలిపించుకోవడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. మున్నూరు కాపులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని షోయబ్ హాల్‌లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఓటరు నమోదుపై స్పెషల్ క్యాంపెయిన్

• కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు



కుత్బుల్లాపూర్: రెండో స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి పులి సైదులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మొత్తం 582 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పారదర్శకంగా ఓటరు జాబితాను తయారు చేసే క్రమంలో అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ముందస్తుగా ఓటు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

◆ ఆగస్టు 21వ తేదీన ఓటరు ముసాయిదా విడుదల చేసిన జాబితాలో పేరు ఉందో.. లేదో అన్న విషయాన్ని పరిశీలించుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో పేరులో ఏదైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని సవరించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. నూతన ఓటరు నమోదు దరఖాస్తు-6, ఆధార్ అనుసంధానం దరఖాస్తు-6బీ, ఓటరు జాబితా అభ్యంతరాలు ఓటర్ తొలగింపునకు దరఖాస్తు-7, మార్పులు చేర్పులకు దరఖాస్తు-8లను సెప్టెంబర్ 19వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

'నేను చేసిన అభివృద్ధే నన్ను గెలిపిస్తుంది'

రంగారెడ్డినగర్: తాను చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ మారుతీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు గురువారం పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేసిన ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం మూడోసారి ఎన్నికల బరిలో నిలబడిన ఎమ్మెల్యే వివేకానంద్‌ను తమ మద్దతు తెలుపుతూ తీర్మాన పత్రాన్ని అందజేశారు. వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు జె రాఘవులు, శ్రీనివాస్, సంతి భూషణ్, ఆనందన్, ప్రెసిడెంట్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథం, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, భాను చందర్, సెక్రటరీ గణేష్, జాయింట్ సెక్రటరీ, సుమన్ ఆనంద్, కోశాధికారి పద్మనాభ రెడ్డి, ఆర్గనిసింగ్ సెక్రటరీస్ శేఖర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించిన ప్రధానికి మహిళల కృతజ్ఞతలు

• కార్పొరేటర్ మహేందర్


ప్రధానమంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్న స్థానిక మహిళలు, కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: జనతానగర్‌లో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు తగ్గించిన నేపథ్యంలో మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ గురువారం స్థానిక మహిళలతో కలిసి ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్షాబంధన్ సందర్భంగా సోదరీమణులకు గ్యాస్ ధరలు తగ్గించి కానుక అందజేశారన్నారు. ప్రతిపక్షాలు నరేంద్ర మోదీ ప్రవేశపెట్టే పథకాలను బడుగు, బలహీన మధ్య తరగతి కుటుంబాలకు అత్యంత అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రజల మద్దతు మోదీకి లభిస్తుందనే ఆయనపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

◆ నిరుపేదలకు ప్రధాన మంత్రి ఇప్పటి వరకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. పుట్టిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పలు పథకాలు ప్రవేశపెట్టారని ప్రతి ఒక్కరూ ఈ పథకాలను అందుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడుతుందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కూడా బీజేపీ జెండా ఎగురబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మనోహర్, వినోద్, కిషోర్, తిరుపతి, ప్రశాంత్, సాయి, యోగేష్, కనకమ్మ, సద్గుణ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం..

ఆల్విన్‌కాలనీ: గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించినందుకు ప్రధాన మంత్రి మోదీకి గురువారం రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు గజ్జల యోగానంద్ మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ ధరలు తగ్గించటంతో దేశంలోని 33 కోట్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట లభించిందన్నారు. అదే విధంగా ఉజ్వల లబ్ధిదారులకు రూ.400 అదనపు ప్రయోజనం పొందారని తెలిపారు.

వెంకటేశ్వరనగర్‌లో పాదయాత్ర...

◆ అనంతరం పాదయాత్రలో భాగంగా వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడి బీజేపీకి భారీ విజయం చేకూరుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు విద్యాకల్పన, ఏకాంత్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మోతీనగర్: దేశ మహిళలకు రాఖీ పండుగ కానుకగా ప్రధానమంత్రి మోదీ గ్యాస్ ధరలను తగ్గించటం హర్షించదగ్గ విషయమని మహిళా మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి పులిగొళ్ల లక్ష్మీయాదవ్ పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో బుధవారం రాత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పెరిగిన వంట గ్యాస్ ధరలతో మహిళలకు ఇబ్బందులు పడుతున్న తరుణంలో దేశ ప్రధాని మోదీ పెద్దన్న పాత్ర వహించి రూ.200 తగ్గించటం మహిళలకు ఎంతో ఊరటను ఇచ్చిందన్నారు.

◆ అదే విధంగా రాష్ట్రంలో పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు సైతం తగ్గించకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. గతంలో మోదీ పలుమార్లు దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించినా రాష్ట్రంలో మాత్రం తగ్గించకుండా తన మొండి వైఖరి అవలంభిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు వెంకటరమణరెడ్డి, వెంకటరెడ్డి, కృష్ణంరాజు, మల్లేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గజ్జల యోగానంద్


కొత్తూరు సీతయ్య నగర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లక్ష్మీ యాదవ్